సాక్షి రంగారెడ్డి

శనివారం । 27 । జూలై । 2024



జేఈతో మెదడువాపుకి చెక్

మెదడు వాపు నివారణ టీకాలను సక్రమంగా వేయాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ అన్నారు. 8లో▸



సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అన్నారు. 8లో▸



వీధికుక్కల నియంత్రణకు..

వీధి కుక్కల నియంత్రణకు బ్లూక్రాస్‌తో కలిసి పనిచేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ తెలిపారు. 8లో▸

నేడు తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

తుక్కుగూడ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.



అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ : తుక్కుగూడ
కమిషనర్ : బి.వెంకట్రామ్
తేదీ : 27-7-2024 (శనివారం)
సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
79895 50789

సర్కారు భూముల్లో 'రియల్' గద్దలు

- మహేశ్వరంలో నయాసిటీ ప్రకటన నేపథ్యంలో నజర్
- అసైన్డ్, లావణి, భూదాన్, వక్ఫ్, దేవాదాయ భూములే టార్గెట్
- కందుకూరు మండలం తిమ్మాయిపల్లి, కొత్తూరు, ముచ్చర్ల, మహేశ్వరం మండలం మంఖాల్‌లో భారీగా కొనుగోళ్లు
- రైతులను మభ్య పెట్టి.. అగ్గువకే కొట్టేస్తున్న వైనం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహేశ్వరం మండలం మంఖాల్ సర్వే నంబర్ 625 నుంచి 642 వరకు ఉన్న లావణి పట్టా భూములపై ఓ రియల్ ఎస్టేట్ సంస్థ కన్నేసింది. బహిరంగ మార్కెట్‌లోని ధరలతో పోలిస్తే చాలా తక్కువకు లభిస్తుండటంతో గుట్టుగా అగ్రిమెంట్లు చేసుకుంటోంది. ఇప్పటికే ఆయా అసైనీలకు రూ.కోటి అడ్వాన్స్ చెల్లించినట్లు సమాచారం. ఇక కందుకూరు మండలం తిమ్మాయిపల్లిలోని సర్వే నంబర్ 9/1, సర్వే నంబర్ 9/2లోని అసైన్డ్ భూమిని ఎకరం రూ.40 లక్షలకే సొంతం చేసుకుంటున్నారు. కొత్తూరు పరిధిలోని సర్వే నంబర్లు 233, 235లలోని అసైన్డ్ భూమిని రూ.25 లక్షలకే ఎకరం చొప్పున అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. ఇక ముచ్చర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 50లోని అసైన్డ్ భూమిని రూ.15 లక్షలకే ఎకరం చొప్పున కొనుగోలు చేస్తున్నారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు ఆయా రైతులు, వారి కుటుంబ సభ్యులతో ఖాళీ స్టాంప్ పేపర్లపై సంతకాలు చేయించుకుంటున్నారు. ధరణి పోర్టల్‌లో అప్పటి వరకు నిషేధిత జాబితాలో కన్పించిన ఈ భూములు రియల్టర్ల చేతుల్లోకి వెళ్లిన వెంటనే పట్టాలుగా మారుతుండడం విశేషం.

మహానగరం ప్రకటనతో..

కాలుష్యకారక ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. శంషాబాద్-మహేశ్వరం మధ్యలో మరో మహానగరాన్ని ఆవిష్కరించబోతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఇప్పటికే ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో విశాలమైన టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఐటీ అనుబంధ కంపెనీలు, మెడికల్ కాలేజీ, ఆస్పత్రులను నెలకొల్పి, ఆయా ప్రాంతాలకు మెట్రోరైల్‌ను విస్తరించి, ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానించనున్నట్లు ప్రకటించారు. జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు భవిష్యత్తులో ఇక్కడ భారీగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలో రైతుల్లో ఉన్న బలహీనతను కొంతమంది రియల్టర్లు 'క్యాష్' చేసుకుంటున్నారు. ఇప్పటికే రైతులకు పంచిన అసైన్డ్, లావణి, భూదాన్, వక్ఫ్, దేవాదాయ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోబోతోందని ప్రచారం చేస్తున్నారు. రైతులను మభ్యపెట్టి వారి నుంచి తక్కువ ధరకు వాటిని సొంతం చేసుకుంటున్నారు. ఎలాంటి వివాదాలు లేని పట్టా భూములకు మార్కెట్లో భారీ డిమాండ్ ఉండటం.. ఎకరం రూ.పది కోట్లకుపైగా పలుకుతుండటం.. పట్టా భూములతో పోలిస్తే అసైన్డ్, లావణి, ఎక్స్ ఆర్మీ, స్వాతంత్ర్య సమరయోధుల భూములు తక్కువ ధరకు వస్తుండడంతో కొనుగోలు చేస్తున్నారు. భూమి విలువలో పదిశాతం అడ్వాన్స్ చెల్లించి, తెరవెనుక తతంగం నడుపుతున్నారు. తమకున్న రాజకీయ, ఆర్థిక పలుకుబడిని ఉపయోగించి వాటిని పట్టా భూములుగా మార్చుకుని లబ్ధి పొందుతున్నారు. నిజానికి అసైన్డ్ భూములు అమ్మడమే కాదు, కొనడం కూడా నేరమే. కానీ రియల్టర్లు ఇవేవీ పట్టించుకోవడం లేదు.

ఇప్పటికే వందల ఎకరాలు మాయం

ఇప్పటికే మహేశ్వరం మండలం కొంగరకుర్దులోని వక్ఫ్ భూములు సహా నాగారంలోని భూదాన్ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. మహేశ్వరం-తుమ్మలూరు రెవెన్యూ గ్రామాల మధ్య ఉన్న 70 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. తుక్కుగూడలోని శిఖం, అసైన్డ్ భూములు పట్టా భూముల్లో కలిసి పోయాయి. ఆయా భూముల్లో వెంచర్లు రావడం, విల్లాప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరుగుతుండటాన్ని పరిశీలిస్తే..ప్రభుత్వ భూములు ఏ విధంగా మాయమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. అక్రమార్కులకు రెవెన్యూ విభాగంలోని కొంతమంది అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పహణీల్లో మార్పులు చేర్పులు చేయడంతో పాటు రికార్డులను ట్యాంపర్ చేస్తున్నారు. ధరణి పోర్టల్‌లోని లోసుగులను అడ్డుపెట్టుకుని నిషేధిత జాబితా నుంచి వాటిని తొలగించి, రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మొదలు తహసీల్దార్, ఆర్డీఓ, జిల్లా ఉన్నతాధికారి వరకు ఎవరి వాటాలు వారికి ముట్టజెప్పి.. లైన్ క్లియర్ చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇలా తక్కువ ధరకు కొట్టేసిన భూములకు ఆ తర్వాత బహిరంగ మార్కెట్లో ఎక్కువ నిర్ణయించి భారీగా 'సొమ్ము' చేసుకుంటున్నారు.

ఏ చట్టానికి లోబడి..?

మహేశ్వరం మండలం మంఖాల్‌లోని పలు సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములను ఏళ్ల క్రితమే అప్పటి ప్రభుత్వాలు స్థానిక పేదలకు అసైన్డ్ చేసింది. అసైన్డ్, భూదాన్, ఎక్స్ ఆర్మీ, లావణి చట్టాల ప్రకారం ఒక్కో కుటుంబానికి గరిష్టంగా తరి అయితే రెండున్నర ఎకరాలు, మెట్ట అయితే ఐదెకరాలలోపే ఉంటుంది. స్వాతంత్ర్య సమరయోధులకు, ఏదైనా ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి ఈ విషయంలో కొంత మినహాయింపు ఇచ్చింది. ఆయా చట్టాలకు భిన్నంగా సర్వే నంబర్ 628/1లో ఒక వ్యక్తికి 6.20 ఎకరాలు, సర్వే నంబర్ 628/2లో 6.20 ఎకరాలు, సర్వే నంబర్ 629/1లో 9.12 ఎకరాలు, సర్వే నంబర్ 630/1లో 8.4 ఎకరాలు, సర్వే నంబర్ 630 /4లో 8 ఎకరాలు, సర్వే నంబర్ 627లో 9 ఎకరాల చొప్పున రికార్డైంది. భార్యభర్తలిద్దరు వేర్వేరు సర్వే నంబర్లలో ఆయా చట్టాలు నిర్దేశించిన విస్తీర్ణానికి భిన్నంగా భూములను కలిగి ఉండటాన్ని పరిశీలిస్తే..ఈ భూములను ఏ చట్టానికి లోబడి పంచారనేది అంతు చిక్కని ప్రశ్నగా మిగిలిపోయింది.నిజానికి పట్టా భూములు మాత్రమే ఐదెకరాలకు మించి రికార్డై ఉంటాయి. ఇక్కడ లావణి పట్టా భూములు కూడా ఆ చట్టానికి భిన్నంగా రికార్డై ఉండటాన్ని పరిశీలిస్తే..అధికారుల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వాటిని అమ్మడం, కొనడం నేరం

అసైన్డ్, లావణి, భూదాన్, సీలింగ్ భూములు అమ్మడం, కొనడం నేరం. ఒకవేళ ఎవరైనా అగ్రిమెంట్ చేసుకున్నట్లు నిర్ధారణ అయితే ఆయా భూములను పీఓటీ కింద రైతుల నుంచి వెనక్కి తీసుకునేందుకు వెనుకాడబోం. ప్రైవేటు వ్యక్తులకు భూములను తక్కువకు అమ్ముకుని మోసపోయేకంటే వివిధ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం సేకరిస్తున్న వాటికి ఇవ్వడం ఉత్తమం.

– సూరజ్‌కుమార్, ఆర్డీఓ, కందుకూరు



ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

విద్యారంగ సమస్యలపై గళం

- ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా
- భారీగా తరలివచ్చిన విద్యార్థులు
- హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

చేవెళ్ల: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ శంషాబాద్ కన్వీనర్ క్లోంల సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం పలు కళాశాలల విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల స్వార్థం కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు.ప్రభుత్వాలు మారుతున్నా విద్యార్థుల సమస్యలు మాత్రం తీరడం లేదన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలని, గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని, కళాశాలల అడ్మిషన్లు ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని, అక్రమ డొనేషన్లను అరికట్టాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, యూనివర్సిటీల్లో అశాస్త్రీయంగా పెంచిన పీజీ, ఇంజనీరింగ్ కోర్సుల ట్యూషన్ ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్, నగర కార్యదర్శి మహిపాల్, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

విద్యార్థుల ధర్నాతో హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. ఇటు వికారాబాద్ వైపు,అటు హైదరాబాద్ వైపు గంటపాటు కిలోమీటర్ల మేర పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అత్యవసరంగా వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరికి పోలీసులు జోక్యం చేసుకొని ధర్నాను విరమింపజేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు

అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయొద్దని,ప్రతి పంచాయతీ పరిధిలో ఆరు వేల మొక్కలు తప్పకుండా నాటాల్సిందేనని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ స్పష్టం చేశారు.వన మహోత్సవంలో భాగంగా చర్లపటేల్‌గూడ పంచాయతీ పరిధిలోని ఖాళీ స్థలంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా 82,59,900 మొక్కలకుగాను ఇప్పటి వరకు 28,69,384 నాటినట్లు తెలిపారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున పది రోజుల్లో నిర్ణీత లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటి పెరట్లో, గ్రామ కంఠం ఖాళీ స్థలాల్లో, రోడ్ల కిరువైపులా, పొలాల గట్లపై విరివిగా మొక్కలు నాటాలన్నారు. నీరు, విద్యుత్ సౌకర్యం ఉన్న చోట్ల పండ్ల తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, ఏపీడీ సక్రియనాయక్, ఎంపీడీవో వెంకటమ్మ, ఏపీఓ తిరుపతాచారి, ఈసీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, టీఏలు శ్రీనివాస్,ఇందిర, సునంద పాల్గొన్నారు.



మొక్క నాటి నీరుపోస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

న్యూస్‌రీల్

ధరణి పెండింగ్ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ శశాంక



తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

కడ్తాల్: ధరణి పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా భూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని తహసీల్దార్ ముంతాజ్‌కు సూచించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మాణం పూర్తి కావచ్చిన తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని, భవనాన్ని త్వరగా ప్రారంభించి వినియోగంలోకి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, డీటీ వినోద్ ఉన్నారు.

అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ

కందుకూరు: అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ అవుతుందని జిల్లా వ్యవసాయాధికారిణి ఎస్.గీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కందుకూరు, గఫూర్‌నగర్, ధన్నారం, పులిమామిడి గ్రామాల్లో శుక్రవారం మండల వ్యవసాయాధికారి లావణ్యతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో రుణ మాఫీ పొందిన రైతులను నేరుగా కలిసి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. రైతులు తమకు సకాలంలో రుణమాఫీ జరిగిందని, ఆ రుణాన్ని పంట సాగుకు ఉపయోగిస్తామని వివరించారు. అనంతరం ఆమె జైత్వారంలో సాగులో ఉన్న మొక్కజొన్న, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. రైతు బీమా కోసం ఆగస్టు 5వ తేదీ లోపు ఏఈఓల వద్ద సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఏఈఓలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ఎల్.రాజు, జె.శ్రీహరి పాల్గొన్నారు.



రైతుతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి గీతారెడ్డి తదితరులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఘు నాయక్

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత

- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రఘు నాయక్

షాద్‌నగర్: అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రఘు నాయక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేస్తూ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించిందని చెప్పారు. గిరిజన తండాల అభివృద్ధికి కట్టుబడి ఉందని,ఇందులో భాగంగానే గిరిజన శాఖను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించిందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కంకణబద్ధుడై ఉన్నారన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చిన బడ్జెట్‌పై బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు విమర్శలు చేయడం సరికాదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టుకునేందుకు కాంగ్రెస్ చేసే పోరాటంలో బీఆర్‌ఎస్ కలిసి రావాలన్నారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.


రైల్వేలైన్ మంజూరు చేయండి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు: సూర్యాపేట నుంచి దేవరకొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ మీదుగా గద్వాల్ వరకు నూతన రైల్వేలైన్‌ను మంజూరు చేయాలని కేంద్ర రైల్వేశాఖామంత్రి అశ్వినివైష్ణవ్‌కు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయంలో శుక్రవారం ఆయనను నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుధాకర్‌రావ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డితో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ప్రాంతాలకు రైల్వే సదుపాయం కల్పించేందుకు నూతన రైల్వేలైన్ నిర్మించాలని వారు వినతిపత్రం అందించారు.

చిలుకూరులో భారీ బందోబస్తు



పోలీసు చెక్‌పోస్టు

మొయినాబాద్ వక్ఫ్ బోర్డు స్థలంలో పురాతన నిర్మాణం తొలగించడంతో ఏర్పడిన వివాదం సద్దుమణుగుతోంది. మొయినాబాద్ మండలం చిలుకూరు రెవెన్యూలోని వక్ఫ్ బోర్డు స్థలంలో శుక్రవారం ఓ వర్గం వారు ప్రార్థనలు చేసేందుకు రావచ్చని భావించిన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరినీ అక్కడికి రానీయకుండా సుమారు 180 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టారు. ఎస్‌ఓటీ, సివిల్ పోలీసులతోపాటు పారామిలటరీ బలగాలను మోహరించారు. మధ్యాహ్నం 12 నుంచి 2.30 గంటల వరకు అటువైపు ఎవరినీ వెళ్లనీయలేదు.

లోతట్టు.. గట్టెక్కు!

వరదల నియంత్రణకు కేంద్రం నిధులు

- హైదరాబాద్ సహా ఆరు నగరాలకు..
- రూ.2514.36 కోట్లు ఇవ్వాలని నిర్ణయం
- అమిత్‌షా అధ్యక్షతన జరిగిన భేటీలో ఆమోదం
- హర్షం వ్యక్తం చేస్తున్న నగరవాసులు



సాక్షి, సిటీబ్యూరో: వానాకాలం వచ్చిందంటే చాలు నగరంలో అనేక ప్రాంతాల ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతుంటారు. చిన్నపాటి వర్షం పడితేనే లోతట్టు ప్రాంతాలు చిగురుటాకులా వణుకుతుంటాయి. 2000వ సంవత్సరంలో 40 వేల కుటుంబాలు వరదలకు ప్రభావితమయ్యాయి. 2020లో దాదాపు 37 వేల కుటుంబాలు అల్లకల్లోలమయ్యాయి. నిలువ నీడ లేకుండా ఇల్లూ వాకిలీ వదిలి సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు పరిస్థితిలో ఎలాంటి మార్పూ రాలేదు. వరదలు రావడం.. ఇళ్లలోకి నీరు చేరడం.. సిబ్బంది వచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించడం.. వరదలు తగ్గగానే మళ్లీ ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోవడం.. ఏటా జరిగే తంతు. పూర్తిస్థాయిలో వరదలు రాక ముందే సమగ్ర ప్రణాళికతో లోతట్టు ప్రాంతాల్లో నియంత్రణ చర్యలు తీసుకుంటే ప్రజలకు మేలు జరుగుతుంది. వారి ఇబ్బందులు తగ్గుతాయి.అందుకే కేంద్రం హైదరాబాద్‌కు నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నేతృత్వంలో ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో హైదరాబాద్ సహా ఆరు నగరాలకు వరదల నియంత్రణకు, అందుకు తగ్గ నిర్మాణాల కోసం నిధులు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. నేషనల్ డిజాస్టర్ మిటి గేషన్ నిధులు (ఎన్‌డీఎంఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ నిధుల నుంచి రూ.2,514.36 కోట్లు కేటాయించనుంది. హైదరాబాద్‌తో పాటు ముంబై, కోల్‌కతా, బెంగళూరు, అహ్మదాబాద్, పుణె నగరాలకు ఈ నిధులు కేటాయించింది. ఇందులో భాగ్యనగరానికి రూ.300 నుంచి రూ.500 కోట్ల వరకు వచ్చే అవకాశముందని పురపాలకశాఖ ఉన్నతాధి కారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు.

ఎలా వినియోగిస్తారో?

జీహెచ్‌ఎంసీతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో విపత్తులను నియంత్రించేందుకు కొత్తగా 'హైడ్రా'అమల్లోకి వచ్చింది. కేంద్రం తాజాగా విడుదల చేయబోయే నిధులను ఎలా వినియోగిస్తారనే దానిపై ఆసక్తికరంగా మారింది. నిధులను వరదల సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా వినియోగించుకుంటే బాగుంటుందని నిపుణులు, నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

యువ ఆపద మిత్ర..

ఇక.. రాష్ట్రంలోని వరద ప్రభావిత జిల్లాల్లో కూడా విపత్తు నిర్వహణ చేపట్టేందుకు యువ ఆపద మిత్ర పథకానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ పథకానికి రూ.470.50 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. దేశంలోని 315 జిల్లాల్లో ఈ పథకం అమలు చేయనున్నారు. ఈ పథకం కింద 1300 మందికి ఆపద మిత్ర వలంటీర్లుగా శిక్షణ అందిస్తారు. అంతేకాకుండా ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌వైకేఎస్ నుంచి 2.37 లక్షల మంది వలంటీర్ల సేవలను విపత్తు నిర్వహణ కోసం వినియోగించుకుంటారు.

బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండిచెయ్యి

- ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండి చెయ్యి చూపించిందని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా దివ్యాంగుల సంక్షేమాన్ని ప్రస్తావించలేదని విమర్శించారు. అధికారం చేపట్టిన వెంటనే రూ.6వేల పెన్షన్ అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రస్తుతం పెదవి విప్పడం లేదని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు ప్రత్యేక నిధులు కేటాయించిన ప్రభుత్వానికి దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వడం ఎందుకు సాధ్యం కావడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి దివ్యాంగులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్, నాయకులు సంతోష, కుసుమ, మనీల, మల్లేష్, నర్సింలు, బాల్‌రాజ్, ఆంజనేయులు, మసూద్ తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న దివ్యాంగులు

జర్నలిస్టుపై దాడి

యువకుడిపై కేసు

మొయినాబాద్: జర్నలిస్టుపై దాడి చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని ముర్తూజగూడలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం మండల పరిధిలోని ముర్తూజగూడకు చెందిన గణేశ్ ఓ దినపత్రికలో జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఇంట్లో నిద్రిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన మోసిన్ అనే యువకుడు ఇంటికి వచ్చి గేటు తన్నాడు. రిపోర్టర్ నిద్రలేచి బయటకు రాగానే బూతులు తిడుతూ రోడ్డువైపు తీసుకెళ్లాడు. రోడ్డుపై రెండు కార్లలో కొంతమంది జనం ఉన్నట్లు గణేష్ గమనించి వెనుదిరిగాడు. దీంతో మోసిన్ కారులోంచి ఓ మారణాయుధం తీసుకువచ్చి దాడి చేసేందుకు యత్నించగా అప్పటికే నిద్రలేచిన చుట్టుపక్కలవారు వారించారు. ఇది గమనించి కార్లలో ఉన్న వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. గణేష్ వెంటనే 100 డయల్ చేయడంతో పోలీసులు వచ్చి ఓ కారును, దాడికి పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మొబైల్ దుకాణంలో చోరీ

30 సెల్‌ఫోన్లు.. నగదు అపహరణ

శంకర్‌పల్లి: గుర్తు తెలియని దొంగలు అర్ధరాత్రి బీభత్సం సృష్టించారు. ఓ సెల్‌ఫోన్ దుకాణంలో దూరి 30 మొబైల్ ఫోన్లు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన జీవన్ కుమావత్(23) శంకర్‌పల్లి మండలం మోకిలలో మూడేళ్లుగా బాలాజీ మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని దుండగులు షటర్‌ను ధ్వంసం చేసి దుకాణంలోకి చొరబడి ఫోన్లు, కౌంటర్‌లోని నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చోరీకి గురైన మొబైల్ షాప్

చౌక.. బియ్యమేనా!

రేషన్ దుకాణాల్లో తగ్గిన సరుకులు
- పేద, మధ్యతరగతి ప్రజలపై పెరిగిన ఆర్థిక భారం
- బీఆర్‌ఎస్ హయాంలో బియ్యం మాత్రమే పంపిణీ
- 'అమ్మ హస్తం'కోసం ఎదురు చూపు

కేశంపేట: పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర సరుకులను తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రజా పంపిణీ వ్యవస్థ ఏర్పాటైంది. ఇందులో భాగంగా బియ్యం, గోధుమలు, చక్కెర, కిరోసిన్, కారంపొడి, పసుపు, చింతపండుతో కలిపి అమ్మ హస్తం పేరుతో తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా అందించేవారు. వీటిని పౌర సరఫరాల శాఖ ఒక్కొక్కటిగా తగ్గిస్తూ బియ్యానికే పరిమితం చేసింది. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువులను కొనలేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పంచదార, కిరోసిన్ కట్

ఆహార భద్రత కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి పౌరసరఫరాల శాఖ బియ్యం మాత్రమే సరాఫరా చేస్తుంది. కిరోసిన్‌ను, పంచదారతో పాటు నిత్యావసర వస్తువుల పంపిణీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వం బ్రేక్ వేసింది. ఫలితంగా పేదలు నిత్యవసర సరుకులను మార్కెట్‌లో అధిక ధరలకు కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆహార భద్రత కార్డుదారుల కుటుంబంలో ఒక్కొక్కరికి ఆరు కిలోలు, అంత్యోదయ కార్డు ఉన్నవారికి 35 కిలోల బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేస్తున్నారు.


రేషన్ షాపులో సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

ఆర్థికంగా ఇబ్బందులు

నేటికి గ్రామాల్లో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా రేషన్ షాపుల ద్వారా అందించే సరుకులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు చుక్కలను అంటాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. వీరిపై భారం పడకుండా ఉండలాంటే ప్రభుత్వం నిత్యావసర సరుకులను ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందించాలి. ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.

అమ్మ హస్తంతో తొమ్మిది రకాల సరుకులు

గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడే అమ్మహస్తం పేరుతో నిరుపేదలకు తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులను అందించేవారు. అనంతరం బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువులను తగ్గించి, బియ్యం మాత్రమే అందిస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులను అందిస్తుందనే ఆశలో ఉన్నారు.

సరుకులు రావడం లేదు



గతంలో రేషన్‌షాపుల ద్వారా బియ్యంతో పాటు తొమ్మిది రకాల వస్తువులను ఇచ్చేవారు. అప్పుడు ఇళ్లు సాఫీగా గడిచేది. ప్రస్తుతం బియ్యం మాత్రమే ఇవ్వడం, మిగిలిన వస్తువులను బయట అధిక ధరలకు కొనడం వలన ఆర్థికంగా భారం పడుతోంది. అధికారులు స్పందించి నిత్యావసర వస్తువులను రేషన్‌షాపుల ద్వారా అందించాలి.

– జయరాం, రాళ్లగండితండా

పేదలపై భారం



రేషన్‌షాపుల ద్వారా బియ్యం, పంచదార, ఉప్పు, పప్పు, మిరపపొడి, చింతపండు, పసుపు, గోధుమ పిండి, గోధుమలు, మంచి నూనె, కిరోసిన్ ఇలా వస్తువులను అందించారు. బహిరంగా మార్కెట్‌లో రేట్లు విపరీతంగా ఉండటం వలన సామాన్య ప్రజలపైన భారం పడుతోంది. ప్రభుత్వం అన్ని రకాల నిత్యావసర వస్తువులను రేషన్‌షాపుల్లో అందించాలి.

– శివాజీ, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి

రేషన్‌షాప్‌లు బలోపేతం చేయాలి



రేషన్‌షాపుల ద్వారా తొమ్మిది రకాల వస్తువులను పంపిణీ చేయడం ద్వారా మాకు ఉపాధి లభించేది. ప్రస్తుతం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తుండటంతో నామ మాత్రంగా వచ్చే కమీషన్‌తో కరెంట్‌బిల్లు, నెట్‌కే సరిపోవడం లేదు. ప్రభుత్వం రేషన్‌డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించి రేషన్‌దుకాణాల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి.

– పల్లాటి కవిత, రేషన్ డీలర్, పాపిరెడ్డిగూడ

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్


హెచ్‌ఎం ఆంజనేయులుకు సభ్యత్వం అందజేస్తున్న గోవర్ధన్‌యాదవ్

మొయినాబాద్/ మొయినాబాద్ రూరల్: ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని అజీజ్‌నగర్, బాకారం, అమ్డాపూర్, తోల్‌కట్ట, హిమాయత్ నగర్ పాఠశాలల్లో బందయ్య ఆధ్వర్యంలో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ పాల్గొని ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుత.. త్వరలోనే ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి ఉపాధ్యాయులకు జేఎల్‌డీఏలగా పదోన్నతి సాధిస్తామన్నారు. ఉమ్మడి ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి ఉపాధ్యాయులకు ఎంఈఓలు, జేఎల్, డైట్ లెక్చరర్స్‌గా ప్రమోషన్లు ఇప్పిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను 50 శాతం పర్మినెంట్ ఇప్పిస్తూ పీఆర్‌సీ ఏర్పాటు చేయిస్తామన్నారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు తక్షణమే హెచ్‌ఎంలుగా ప్రమోషన్లు ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జక్కని బందయ్య, గౌరవ అధ్యక్షుడు రాములు, రాష్ట్ర బాధ్యులు సత్యనారాయణరెడ్డి, నరేందర్, సంజీవ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, బీమ్లా, నారాయణగౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

లంబాడీలపై వివక్ష తగదు

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో లంబాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో లంబడీ కులస్తులకు నిధుల కేటాయింపులో ప్రభుత్వం తీవ్ర వివక్ష ప్రదర్శించిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చెవేళ్లలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభలో ఖమ్మం, మహబూబాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లలో ఐటీడీఏలకు రూ.500 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. మూడు ఎస్టీ కార్పొరేషన్లను ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లు గెలిపిస్తే అన్యాయం చేయడం తగదన్నారు. గిరిజనులకు జనాభా ప్రాతిపదికన పదిశాతం నిధులను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే పోరాటం తప్పదన్నారు.

నిమ్స్‌లో త్వరలో డిజిటల్ ఓపీ టోకెన్

లక్డీకాపూల్: నిమ్స్‌లో ఓపీ సేవలు పొందేందుకు వస్తున్న రోగులు పడుతున్న అవస్థలపై యాజమాన్యం స్పందించింది. డిజిటలైజేషన్ విధానంలో టోకెన్లు అందించేందుకు కసరత్తు చేపట్టింది. ఓపీడీ, స్పెషాలిటీ బ్లాక్‌లలో ప్రత్యేకంగా ఓపీ కియోస్క్‌లను అందుబాటులోకి తీసుకువస్తోంది. వీటి నుంచి నేరుగా ఓపీ టోకెన్ తీసుకునే వెసులుబాటును కల్పిస్తోంది. ఈ వినూత్న ప్రయోగం సత్ఫలితాలను ఇస్తే అన్ని విభాగాలకు ఓపీ కియోస్క్‌లను ప్రవేశపెట్టాలన్న యోచనలో యాజమాన్యం ఉంది.

జేఈ టీకాతో మెదడువాపు వ్యాధికి చెక్


ఎన్కేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్

డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం సరఫరా చేస్తున్న మెదడు వాపు నివారణ టీకాలను సక్రమంగా వేయాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని ఎన్కేపల్లి, జీవన్‌గూడ, ముర్తుజాగూడ, బాకారం గ్రామాల్లో జేఈ టీకా పంపిణీ కార్యక్రమాన్ని డాక్టర్ అన్నపూర్ణ ప్రారంభించారు. ఎన్కేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ దామోదర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెదడువాపు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకా వేయిస్తున్నామన్నారు. జేఈ వ్యాక్సిన్‌తో మెదడువాపు వ్యాధికి చెక్ పెట్టొచ్చన్నారు. ఇందులో ఎలాంటి అపోహలకు తావివ్వొద్దన్నారు. భోజన సమయంలో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో రోగాలు దరి చేరవని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌రెడ్డి, ఉపాధ్యాయులు యూ.పోచయ్య, సూపర్‌వైజర్ సునీతాదేవి, ఏఎన్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలు

తుర్కయంజాల్: వీధి కుక్కల నియంత్రణకు బ్లూక్రాస్‌తో కలిసి పనిచేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ తెలిపారు. శుక్రవారం ఆమె జూబ్లీహిల్స్‌లోని బ్లూక్రాస్ కార్యాలయంలో అమలతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీధి కుక్కల నియంత్రణకు బ్లూక్రాస్ సంస్థతో కలిసి పనిచేస్తామన్నారు. వాటికి కుంటుంబ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు.


అమలతో మాట్లాడుతున్న మల్‌రెడ్డి అనురాధ

వేర్వేరు చోరీల్లో ఏడుగురికి రిమాండ్

పహాడీషరీఫ్: గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ టి.భూపతి తెలిపిన ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన జైనుద్దీన్(21) ఏడాది క్రితం బతుకుదెరువు నిమిత్తం వలస వచ్చి షాహీన్‌నగర్‌లోని షాజహాన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గంజాయికి బానిసైన జైనుద్దీన్ అస్సాం నుంచి గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తీసుకొచ్చి స్థానికంగా అవసరమైన వారికి విక్రయిస్తూ విలాసవంత జీవితాన్ని గడుపుతున్నాడు. గురువారం అల్‌జుబ్రీ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ భూపతి నేతృత్వంలో డీఐ ఎ.మధు, ఎస్సైలు షేక్ యూసుఫ్ జానీ, శ్రీనివాసులు, నాగరాజు, శ్రీధర్‌గౌడ్ దాడి చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.50 వేల విలువైన డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది


పహాడీషరీఫ్: పోలీసుల అదుపులో గంజాయి విక్రేత జైనుద్దీన్

దొంగతనం కేసులో ఇద్దరు..

మంచాల: దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను మంచాల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మంచాల ఠాణా పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ బాబ్యానాయక్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఆగాపల్లి సమీపంలో ఓ క్రషర్ మిషన్ వద్ద గుర్తు తెలియని దుండగులు ఈ నెల 24 సుమారు టన్ను బరువైన ఇనుప సామాను దొంగిలించారు. సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. హయత్‌నగర్ బంజార కాలనీకి చెందిన ఆలకుంట్ల గోపి, దేవరకొండకు చెందిన పీట్ల రాజు, కోదాడకు చెందిన దండుగుల శ్రీను, ఇరగడిండ్ల వీరబాబు పాల్గొన్నట్లు గుర్తించారు. దొంగిలించిన సొత్తును రికవరీ చేసి గోపి, రాజును రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ల్యాప్‌టాప్ చోరీ నిందితులకు..

మీర్‌పేట: ల్యాప్‌టాప్‌లు దొంగిలిస్తున్న ఇద్దరిని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రూ.6 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన పాట మహేష్‌బాబు (24), తిక్క లింగయ్య (23) నగరంలోని కుత్బుల్లాపూర్‌లో నివాసముంటున్నారు. వ్యసనాలకు బానిసలైన వారు చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మీర్‌పేటతో పాటు నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని హాస్టళ్లలోకి ప్రవేశించి ల్యాప్‌టాప్‌లను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మీర్‌పేట పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 13 ల్యాప్‌టాప్‌లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

బెట్టింగ్ యాప్ అప్పులు తీర్చేందుకు...

కొత్తూరు: బెట్టింగ్ యాప్‌లతో అప్పులపాలైన ఓ యువకుడు చోరీల బాటపట్టాడు. గురువారం మండల పరిధిలోని ఖాజీగూడతండాలో చోరీకి విఫలయత్నం చేశాడు. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. కేశంపేట మండలం రాళ్లగడ్డ తండాకు చెందిన పవన్‌నాయక్(21), వెంకటేశ్ నాయక్ స్నేహితులు. పవన్‌నాయక్ బెట్టింగ్ యాప్‌ల కారణంగా రూ.లక్షల్లో నష్టపోయి వాటిని తీర్చేందుకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక ఈ నెల 25న స్నేహితుడు వెంకటేశ్‌నాయక్‌తో కలిసి చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కొడిచర్ల పంచాయతీ ఖాజీగూడ తండాకు బైక్‌పై వచ్చారు. తండాలో మంజుల నిర్వహిస్తున్న కిరణా దుకాణంలో సిగరెట్లు కొనుగోలు చేసి పరిసరాలను పరిశీలించారు. పథకంలో భాగంగా మరో మారు దుకాణానికి వచ్చి బిస్కెట్ ప్యాకెట్ ఇవ్వమని చెప్పి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడు అపహరించేందుకు యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో ఇద్దరు బైకుపై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు పేటీఎం యాప్ నుంచి వివరాలు సేకరించి వారి ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం ఒప్పుకోవడంతో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


మంచాల: పోలీసుల అదుపులో నిందితులు